# సద్గతి

గాఢ నిద్రలోనుంచి హఠాత్తుగా మెలకువ వచ్చినట్టయి తటాలున కళ్ళు తెరిచారు రామదాసు. అది తనకు పరిచితమైన చోటు గాదు. తాను పుట్టి పెరిగి ఎనభై సంవత్సరాల సుదీర్ఘకాలం జీవించిన భూ మండలంతో దీనికి బొత్తిగా పోలిక లేదు, ఏ గ్రహంనుంచి ప్రసవిస్తున్న దోమరి, ఎండకు వెన్నెలకూ మధ్యస్థంగా అక్కడ నెలకొన్న కాంతి ఆహ్లాదకరంగా వుంది. కనుచూపు ఆనినంత మేరకు లెక్కకు మిక్కుటంగా మహావృక్షాలు నిలబడి వున్నాయి. వాటి శాఖోపశాఖలు నలుదిశలకూ విస్తరిల్లి పరస్పరం దట్టంగా అల్లుకపోవడం వల్ల ఆ ప్రదేశం చలువ పందిరిలా, వెయ్యికాళ్ళ మండపంలా వుంది. ఆ కప్పుపైన ఆకాశమనేది వుందోలేదో తెలియరావడంలేదు. బస్తాలతో తెచ్చి బల్లపరుపుగా పోసినట్టున్న నున్నటి యిసుకపైన వేలకొలది మంది వ్యక్తులు, కూర్చుని, పడుకుని, చెట్టుబోదెకు ఆనుకుని విశ్రాంతి తీసుకుంటున్నారు. అది రామదాసు కలలోనైనా ఊహించి ఎరుగని సన్నివేశం. తన చిన్నతనంలో చదివిన కథ ఒకటి అప్పుడతనికి గుర్తుకొచ్చింది. ప్రవరుడనే అమాయిక బ్రాహ్మణుడొకడు ఎవరో దేశ దిమ్మరి యిచ్చిన పసరుమందు పాదాలకు పూసుకుని, దాని ప్రభావం వల్ల వెళ్ళీ వెళ్ళీ హిమాలయాపర్వత సానువుల్లో వాలిపోయాడట! తన విషయంలోనూ అలాంటిదేదో జరిగివుండాలి......

సన్నివేశానికి తగ్గట్టు అక్కడి మనుషుల వాలకం గూడా విడ్డూరంగానే కనిపించింది రామదాసుకు. సంతాపసభలో మౌనప్రార్థన సల్పు తున్నట్టుగా వాళ్ళు స్తబ్ధులై వున్నారు. ఉలకడం, పలకడం మానుకుని దేనికోసమో ఆతురతగా వేచిచూస్తున్నట్టున్నారు. కాగితం పైన గీచిన బొమ్మల్లా వాళ్ళంతా పలచనగా కనిపించడానికి కారణమేమిటో రామదాసుకు కాస్త ఆలస్యంగా స్ఫురించింది. పొడవు, వెడల్పు, మందం అనే మూడు కొలతల్లో వాళ్ళకు మొదటి రెండు కొలతలు మాత్రమే వున్నట్టున్నాయి, మూడోదిలేదు, కొంపదీసి వీళ్ళు దయ్యాలు కాదుగదా! - బెంబేలు పడిపోతూ అనుకున్నాడు రామదాసు.

వెంటనే ఎందుకైనా మంచిదని తనవైపు తనొక సారి చూచుకున్నాడు. ఆ చూచిన క్షణంలో రామదాసుకు ఉన్న మతికూడా పోయినట్టయింది. అప్పుడతని శరీరంలో రక్తమనేదుంటే, అది ఆవిరైపోయివుండేది. అప్పుడతని శరీరంలో గుండె అనేదుంటే, అది వ్రయ్యలైపోయి వుండేది. ఇది శరీరమా? కానేకాదు. వట్టినీడ దూదిపింజ. గాలితో తయారు చేసిన ఆకారం. మనిషికి దెయ్యానికీ గలతేడా పాదాలదగ్గర తేలిపోతుందని జ్ఞప్తికి రావడంతో అతడు భయం భయంగానే తన పాదాలవైపు చూచుకున్నాడు. అబ్బే, అదేంలేదు. పాదాలు ముందుకే వున్నాయి. లేచి నిలబడి నాలుగడుగులు వేద్దామనుకున్నాడు. సంకల్పం కలగడమే తరువాయి, అతనులేచి నిలబడి పోయి వున్నాడు. కానీ అతని పాదాలు మాత్రం నేల కానడం లేదు!

"ఓరిభగవంతుడా! నాశరీరమేమైపోయింది?" అనుకుంటూ ఖిన్నుడైపోయాడు రామదాసు.

పాంచ భౌతికశరీరం+ప్రాణం= మానవుడు అన్న ఈక్వేషన్ ప్రకారం మానవ ప్రాణిలో నుంచీ శరీరాన్ని తీసేస్తే ప్రాణ వస్తువు మాత్రమే జీవాత్మ అన్నారు. ఈ ఆత్మను గురించి భగవద్గీతలో చాలా వివరణ వుంది. ఆత్మను ఆయుధాలేవీ ఛేదింప జాలవు, అగ్ని దహింపజాలదు. నీరుతడుపజాలదు. గాలి యెండింప జాలదు. చిరిగి పోయిన బట్టల్ని విడిచిపెట్టి మానవుడలాగైతే కొత్త బట్టలు ధరిస్తున్నాడో అట్లాగే దేహి అయిన ఆత్మ శిధిలమైపోయిన పాత శరీరాల్ని వదలి, ఇతరములైన కొత్త శరీరాల్లో ప్రవేశిస్తుందట! మరైతేతాను పాత చొక్కాను తీసేసి, కొత్త చొక్కా తొడుక్కోడానికి మునుపటి సంధి దశలో వున్నాడన్న మాట! అంటే ఏమిటి? రామదాసుగా తనువుచాలించాడన్నమాట!

సరే, జరగివలసింది జరగిక మానదు. కానీ ఈ మజిలీ ఎంతకాలమో?

ఇక్కడి సహచరుల్ని అడిగి తెలుసుకుందామనుకుంటే, వాళ్ళు మాత్రం తన కంటే జ్ఞాన ధనులైవుండాలని ఎక్కడుంది? ఈ జీవాత్మల సంఘారామానికి అధిపతో, అధ్యక్షుడో, కన్వీనరో, క్యాంప్ ఆఫీసరో, లేక అలాంటి మహానుభావుడెవ్వరైనా వుంటే అడిగి తెలుసుకోవచ్చు......

ఈ ఊహ పొడ సూపిందో లేదో రామదాసు ఎదుట వున్న భూమి చరాలున చీలినట్టయింది. దీపావళి సందర్భంలో వెన్న ముద్ద కాలినట్టుగా ఆ చీలికలో నుంచి కాంతి ధూమం ఒకటి పైకి లేచింది. అది రానురాను సంకోచిస్తూ వచ్చి చిట్ట చివరకు ఒక పురుషాకారంగా ఘనీభవించింది. పట్టు వలువలతో, పసిడి ఆభరణాలతో, తలపైన రత్నఖచితమైన కిరీటంతో అతడెవరోగానీ ఒక దేవతాపురుషుడిలా వున్నాడు.

"నమస్కారాలు స్వామీ! తామెవరు?" అన్నాడు రామదాసు.

"ఇందాక తలుచుకున్నావు. అప్పుడే మరచిపోయావా నాయనా! జీవాత్మల సంఘారామమని ఒక పేరు కూడా పెట్టావాయె. దీనిక పర్యవేక్షకుణ్ణినేనే!"

"అట్లాగా! జైలులో వార్డెన్ ఎలాగో, యిక్కడ మీరలాగన్నమాట! అంతేనా స్వామీ?" వినయంగా ప్ర శ్నించాడు రామదాసు.

"మంచి మాటే! కానీ ఆ మాటకొస్తే జీవుడి పాలిటికి శరీరం మాత్రం చెరసాల గాకపోయిందా నాయనా?"

రామదాసులోని సమయ స్ఫూర్తిచురుగ్గా పనిచేయసాగింది- "గొప్ప విషయమే సెలవిచ్చారు స్వామీ! చావని పుట్టని సద్గతికి దారి వెదుక్కోవాలన్నదే నాతాపత్రయం గూడా! అమ్మయినా అడగందే పెట్టదంటారుమరి. అందుకని చెబుతున్నాను. నా పేరు రామదాసు. మావూరు రంగనగరం. అన్నదానం రామదాసు. అది రంగనగంరంలో అందరికే తెలిసేమాట. రోజు ఒకటికి పది మందికి తగ్గకుండా ముప్పైయేళ్ళ పాటు నేను అన్నదానం చేస్తూ వచ్చాను. దయానంద అన్నదానమందిర స్థాపనకు, నిర్వహణకు పూర్తి బాధ్యతనాదే! నిరుపేదలకు, బిచ్చగాళ్ళకు కడుపునిండా అన్నం పెట్టడంకంటే..."

"నాయనా రామదాసూ!" వారించినట్టుగా అన్నాడు దివ్య పురుషుడు - "ఎలాగైనా మీరు మానవులు. భగవత్సృష్టిలోమానవులు తెలివైన వాళ్ళక్రింద లెక్క. కొంచెం అవకాశం దొరికితే వాళ్ళలాగే ఎవరి తరపున వాళ్ళు వకాల్తా పుచ్చుకోగలర్న భయం మాకుంది. అందుకని మేమేంచేస్తామో తెలుసా? భూలోకంలో ప్రతి ఉద్యోగిని గురించిఒక సర్వీసు రిజిష్టరు నిర్వహిస్తారుగదా! అట్లాగే ప్రతిమానవునికి సంబంధించి యిక్కడొక ఫైలు వుంటుంది. ఎప్పటికప్పుడు అతడికి సంబంధించిన బాగోగులు అందులో ఉల్లేఖించబడుతూ వుంటాయి. అందుకనుగుణ్యంగా ఫలాఫలాలు నిర్ణయ మవుతాయి. ప్రస్తుతానికి

నువ్వీ విషయాన్ని గుర్తుంచుకుంటే చాలు! ఇంతే సంగతులు...."

మరుక్షణాన ఆ దివ్యపురుషుడున్న చోట వట్టి కాంతి ధూమం మాత్రమే కనిపించింది. క్రమక్రమంగా అది పలచబారి అంతర్హితమైపోయింది.

రామదాసు కెందుకో ఆ దేవతా పురుషుడి ధోరణి అంతగా నచ్చిందిగాదు. అతడు గనక కొంచెం ఓపిక వహించి వుంటే రామదాసు మరెన్నో మంచి విషయాలు చెప్పగలిగి వుండేవాడు. వస్త్రం చిరిగి పోతుంది. ధనం కరిగిపోతుంది. భూమి అన్యాక్రాంత మవుతుంది. అన్నం అలాగాదుగదా! అది ప్రాణాలను నిలబెడుతుంది.... ఇలా భూలోకంలో అన్నదానానికి ఎంతో ప్రశస్తి వుంది. మానవులు తెలివైన వాళ్ళుకుంటే సరిపోయిందా? తీరామారా వాళ్ళ మాటల్ని ఆలకించకపోతే ఎలా?

ఎలగూ పైకి లేవడమైంది. గాలిలో తేలిపోతున్నట్టుగా విహరించడం గూడా ఆనంద ప్రదంగావుంది. ఒకసారి ఆరామాన్నంతా చుట్టి వస్తేపోలా!....రామదాసు ముందుకు కదిలాడు.

కాలచక్రం కదలకుండా నిలిచిపోయి నట్టున్న ఆ ప్రదేశంలో తానెంత సేపు విహరించాడో రామదాసుకు తెలియదు. ఎన్నెన్నో జీవాత్మలు అతనికి తారసిల్లాయి. కానీ వాటిలో పరిచయమున్న ముఖం ఒక్కటైనా లేదు. రంగనగరమేం చిన్న ఊరా? పెద్ద మునుసుపాలిటీ. ప్రతిరోజూ ఎందరో కొందరు పరలోకానికి ప్రయాణం కడుతూనే వుంటారు. ఇటీవల వచ్చిన వాళ్ళెవరైనా వనిపిస్తే బాగుండి పోవును. తెలిసిన వాళ్ళెవరూ లేక పోవడం వల్ల ప్రాణాలకు చాలా యిబ్బందిగా వుంది...."

అలా అనుకుంటున్న క్షణంలో రామదాసుకు ఓ చెట్టు దాపున చిరపరిచితమైన ముఖం ఒకటి కనిపించి నట్టయింది. రామదాసు శరవేగంతో అటువైపు పురోగమించాడు. దగ్గరికి వెళ్ళేసరికి అనుమానం కాస్తా నివృత్తి అయిపోయింది. అతగాడు ముకుందరావే! ఫ్యాక్టరీ యజమాని ముకుందరావు.

"ఏవయ్యా రామదాసూ! నువ్వా యిక్కడి కొచ్చేశావా! చాలా సంతోషం! అన్నట్టు మసిద్దరిలో ముందుగా టికెట్టు పుచ్చుకున్న దెవరో ఎరుగుదువా? "-చిద్విలాసంగా పలకరించాడు ముకుందరావు.

"మాట మాత్రం మృదువు. వీడి గుండె మాత్రం రాతిబండ" అనుకున్నాడు రామదాసు పైకి మాత్రం ఒక దరహాసాన్ని ఒలకబోసి నేను రెండుమాసాల పాటు జబ్బు పడ్డానులెండి! ఆపైన ఎప్పుడో స్మారకం తప్పింది. ఆస్థితిలో ఎన్నాళ్ళున్నానో తెలియదు. నా తెలివి నాకొచ్చే సరికి యిక్కడున్నాను....' ' అన్నాడు.

"నో నేనందుకు వ్యతిరేకం. హార్ట్ఎటాక్ గదా! మంచాన్ని ఆశ్రయించడంగానీ, జబ్బుతో తీసుకోవడంగానీ లేదు. ఎమర్జెన్సీ ప్రయాణమన్న మాట!"

"అయ్యో, పాపం! మీ ఫ్యాక్టరీ వ్యవహారాలన్నీ ఏమైపోయాయో! వాటినెవరకైనా అప్పగించారో లేదో? ఇంతకీ వీలునామా అయినా సిద్ధంచేశారోలేదో....." అనుతాపం ప్రకటించాడు రామదాసు.

"అబ్బే, మరేం పరవాలేదు లేవయ్యా రామదాసూ! అన్నింటికీ ముందుగానే ఏర్పాట్లు చేసి వుంచాను. వ్యాపార దక్షులైన కొడుకులున్నారు. సాంకేతిక నిపుణులున్నారు. ఒళ్ళు దాచుకోకుండా పనిచేసే కార్మికులున్నారు. నాణ్యత మా ప్రధానాశయం గనుక, మా సరుకులకు కావలసినంత గిరాకీ గూడావుంది. నా వ్యాపారసాపారాలని గురించి నాకేమీ బెంగలేదు. ఇంకా మీ అన్నదాన కార్యక్రమాలను గురించి తలుచుకుంటేనే నాకు దిగలుగా వుంది. విరాళాలు సేకరించే దెవరు? "పలానా వారి విరాళంతో ఈరోజు యింతమంది బీదలకు అన్నం పెట్టబడును" అంటూ బోర్డుపైన ప్రకటించే దెవరు? సామగ్రిని చేరవేసి వంటలు చేయించే దెవరు? సకాలంలో అన్నదాన కార్యం నిర్వహించేవారెవరు? మీరక్కడలేకపోయాక దానిగతి అధోగతే! ఈపాటికి మీ అన్నదానమందిరంలో ఒక సారాదుకాణం వెలిసివున్నా

ఆశ్చర్యపడనక్కరలేదు....''

ఓరిపిడుగా! నీ పెదవులపైన మందహాసమైతే, హృదయంలో చంద్రహాసంరా నాయనా!'' అనుకుంటూ వుడుక్కున్నాడు రామదాసు. అయినా ఆభావం పైకి వ్యక్తంగా కుండా " ఏంచేయగలమండీ! లోకంలో ఉపకారచింతన తగ్గిపోతోంది. స్వార్థ భావన బలిసిపోతోంది. మంచి పనులు చేసే ఓపిక ఎవరి కుంటుందింక! కాలంగడిచే కొద్దీ లోకం మరింతగా పాడైపోయేటట్టుంది!'' అంటూ నిట్టూర్చాడు.

"మరీ అంత నిరాశావాదం పనికి రాదయ్యా రామదాసు! మనం లేకపోయినంత మాత్రాన లోకం పాడైపోతుందనుకోడం అమాయకత్వం!'' గల గలానవ్వేస్తూ అన్నాడు ముకుందరావు.

ముకుందరావు పట్ల పట్టరానంత కోపం వచ్చింది రామదాసుకు. రంగనగరంలో కఠినాత్ముల జాబితా ఒకటి తయారుచేస్తే అందులో ముకుందరావు పేరు అగ్రస్థానంలో వుండి తీరాలన్నది రామదాసు నమ్మకం. కిళ్ళీ కొట్టుతో ప్రారంభించి, మూడు ఫ్యాక్టరీలకు యజమాని కాగలిగాడంటే అతడెంత ఘటనా ఘటన సమర్థుడో తెలిపోతుంది. ఫ్యాక్టరీ పని వాళ్ళ విషయంలో అతడు ఖరా ఖండిగా వ్యవహరించడం గురించి కథలు కథలుగా చెప్పుకుంటారు. కార్మికుడు అయిదు నిముషాలు లేటుగా వచ్చినా ఒక పూట జీతం పట్టేస్తాడట! పన్నెండు రోజుల సెలవు వాడుకున్నాక చచ్చిగీ పెట్టినా సెలవు మంజూరు చేసేదిలేదట! పావురాళ్ళ గూళ్ళు లాంటి క్వార్టర్సు కట్టిపెట్టి అద్దెను, కరెంటు చార్జీలను గూడా జీతండబ్బుల్లో నుంచీ మినహాయించుకుంటాడట! ఎవరైనా అనారోగ్యానికి గురైతే, ఫ్యాక్టరీ డాక్టరు దగ్గర సర్టిఫికెట్టు తెస్తేగానీ ఒప్పుకోడట! ఇవన్నీ అలా వుండగా, ముకుందరావు పేరెత్తేసరికి రామదాసుకు ఒళ్ళు మండిపోతుందంటే అందుకు ప్రబలమైన కారణం మరొకటుంది. విరాళాల కోసం అతడెన్నోసార్లు ముకుందరావును దర్శించాడు. అనాథలకు, ఆర్తులకు తోడ్పడడం కోసం ధనవంతులు ముందుకురావలసిన ఆవశ్యకతను గురించి పరిపరి విధాలుగా నచ్చజెప్పడానికి ప్రయత్నించాడు. అన్నదాన ప్రాశస్త్యాన్ని గురించి ఉగ్గడించాడు. కానీ ఎంతగా ప్రాధేయపడినా ఈ పెద్దమనిషి మొండి చెయ్యే చూపిస్తూ వచ్చాడు. ఇలాంటి వారికి సద్గతి రమ్మంటే ఎలా వస్తుంది? రాదు రానేరాదు. మరు జన్మలో ఇతడే మైపుడతాడో చూడాలి....

ఆ క్షణం కూడా రానేవచ్చింది. జీవాత్మల న్యాయ స్థానానికి రావలసిందిగా రామదాసుకు కబురందింది. తనను గురించి వెలువడే తీర్పు పట్ల పరిపూర్ణమైన ఆశాభావమే వున్నప్పటికీ తీరా బయల్దేర వలసి వచ్చేటప్పటికి రామదాసు కాస్తా తబ్బిబ్బు పడిపోయాడు. చాలని దానికి అదొక అపశకునంలా ప్రవేశద్వారాన్ని సమీపించే సరికి బయటి కొస్తున్న ముకుందరావు ఎదురయ్యాడు. అతని ముఖవర్చస్సు చూస్తుంటే దానిముందు చంద్రబింబం దిగదుడుపుకైనా పనికిరాదేమో ననిపించి రామదాసు దిగాలుపడిపోయాడు. 'వెళ్ళొస్తానయ్యా రామదాసూ! నా రికార్డు సంతృప్తికరంగా వుందట! రాబోయే జన్మలో మరుభూముల్ని పండించడం కోసం నదులకు ఆనకట్టలు గట్టే బృహత్కార్యాన్ని నేను చేబట్టానట! సెలవుమరి. వెళ్ళీ నీ విషయమేమైందో చూడు.'' అంటూ అంతకంతకూ దూరమైపోయి, ఆఖరుకొక తారకలా మారి అంతరాళంలో కలసి పోయాడు ముకుందరావు.

రామదాసు కోపోద్రేకంతో నిర్విణ్ణుడై పోయాడు. "అన్యాయం, అక్రమం" అని గొంతెత్తి అరవాలనిపించిందతనికి! భూలోకంతో బాటు అన్ని లోకాలు యికబాగు చేయడనికి వీల్లేనంతగా పాడైపోయినట్టు తోచింది. ఇక్కడి న్యాయ స్థానంలోని ధర్మ మహామాత్రుడెవరో తనకు తెలయదు. ముకుందరావు పట్ల యింతటి ఔదార్యమేమిటని అతణ్ణి నిలదీసి అడిగేస్తాడు.

విశాల సభాస్థలిలో మహోన్నత ధర్మాసనంపైన కొలువు దీరిన న్యాయమూర్తి రామదాసు అంతరంగంలోని ఇంగితాన్ని యిట్టే గ్రహించేశాడు. చిరునవ్వుల దీప్తి ముఖ మండలానికి వన్నెలు

దిద్దుతుండగా, నిప్పుల మీద నీళ్ళు చల్లినట్టు యిలా అన్నాడు-

"నాయనా రామదాసూ! మానవుల్లో పూర్తిగా మంచివాళ్ళుగానీ, బొత్తిగా చెడ్డవాళ్లుగానీ వుండరు. మంచిచెడ్డలు, రాగద్వేషాలు, త్యాగలోభాలు ఎంతో కొంత నిష్పత్తిలో ప్రతిమనిషిలోనూ వుంటాయి. అందువల్ల ఏ మనిషి ప్రవర్తనలో నైనా కొన్ని లోపాలు కొట్టవచ్చినట్టుగా కనిపించవచ్చు. కానీ అదంత ముఖ్యంగాదు. ఫలానా మనిషి వల్ల సమాజానికి మేలు చేకూరిందా, లేక కీడుకలిగిందా అనేది ముఖ్యమైన ప్రశ్న. ఇప్పుడా దృక్పథంనుంచీ ముకుందరావు జీవితాన్ని పరిశీలించాలి. అతడి మూలంగా కొన్ని వందల మందికి జీవనోపాధి చేకూరింది. ఆయా కుటుంబాలలోని వ్యక్తుల జీవితానికి భద్రత సమకూరింది. వారిలో కొందరి పిల్లలు బాగా చదువుకుని ఉన్నత పదవుల్లోకి వెళ్ళగలిగారు. మరికొందరు వృత్తి విద్యల్లో నైపుణ్యం సంపాదించారు. అతడి ప్యాక్టరీల వల్ల స్థానికంగా లభించే ముడి వస్తువులకు గిరాకీ హెచ్చింది. ముడి సరుకులు చేరవేయడానికి, తయారైన వస్తువులు తరలించానికి రవాణా సదుపాయాలు కానలిసి వచ్చాయి. ఇలా ఎందరికో అతడు ప్రత్యక్షంగాను పరోక్షంగాను పని కల్పించాడు. అలాంటి వాడికి మరొక మంచి అవకాశం యివ్వడానికి తటపటాయించనక్కర్లేదు. మరింక నీ విషయమంటావా? నువ్వు మార్పుకు విముఖుడివి. యథాతథవాదివి. నీ దృక్పథంలో సంపన్నులు సంపన్నులుగానే వుండాలి. వాళ్ళ డబ్బుతో వీళ్ళకు అన్నం పెట్టి నువ్వు మాత్రం మధ్యలో ఉల్పాగా కీర్తిని కొట్టెయ్యాలి. నీ మూలంగా సోమరిపోతుల సంఖ్య హెచ్చింది. అనాథుల్ని ఆదుకుంటున్నా మన్న భావన వల్ల కొందరు ధనవంతుల్లో స్వాతిశయం బలిసింది. వెరశి దీనివల్ల సమాజం ఒక్క అడుగైనా ముందుకు వేయలేకపోయింది. దీనిచేత యింకా నాలుగడుగులు వెనక్కు వేయించాలన్న తిరోగమన వాదమే నీ ధ్యేయమైపోయింది. ఏ విధంగా చూచినా నువ్వు క్షమార్హుడివి కావు. అందువల్ల వరుసగా మూడు జన్మలు నువ్వు..."

"వరుసగా మూడు జన్మలు నేను?-" బిక్కరించి చూస్తున్నాడు రామదాసు.

నిమ్మళంగా తీర్పు చెప్పాడు ధర్మమూర్తి.

"పీతగా జన్మిస్తావు!"

*('జ్యోతి' దీపావళి సంచిక - 1985)*